సాక్షి
చిత్తూరు
శుక్రవారం। 6। జూన్। 2025



యోగాకు సన్నద్ధం
బోయకొండ గంగాపురంలో ఈనెల 9న 2000 మందితో యోగా నిర్వహణ చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. - 10లో



బడులకు సన్నబియ్యం
జిల్లాలోని ప్రభుత్వ బడులు, వసతిగృహాలకు ఈనెల 9వ తేదీన సన్నబియ్యం పంపిణీ చేసేందుకు సిద్ధం చేశారు. - 10లో



శ్రీవారి దర్శనానికి 16 గంటలు
శ్రీవారి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక దర్శన టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. - 10లో

న్యూస్‌రీల్

కాయలొస్తే పిలుస్తాం



వేరుశనగ విత్తనాల పంపిణీకి రిజిస్ట్రేషన్ చేస్తున్న సిబ్బంది

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : వేరుశనగ కాయలు మళ్లీ వస్తాయి..గమ్మునుండండి. ఇక్కడ గోల చేయొద్దు. కాయలు వచ్చింది తక్కువే. టోకెన్లు రాని వాళ్ల వివరాలు ఇచ్చి వెళ్లండి. మళ్లీ కాయలొస్తే..పిలుస్తాం. కాయలు తీసుకున్న వాళ్లు కచ్చితంగా విత్తు వేసి చూపించాలి. లేకుంటే ఒప్పుకోం. తీసుకుని విత్తనం వేయలేదంటే..సుఖీభవ డబ్బుల్లో కోతలు పడుతాయంటూ గుబులు పుట్టించారు. జిల్లాలో గురువారం వేరుశనగ విత్తన పంపిణీ కొనసాగింది. ముందుగానే మండల వ్యవసాయశాఖ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది అరకొర కాయల విత్తనంపై రైతులకు వివరించారు. టోకెన్లు అందని వారి వివరాలను తీసుకుని బుజ్జగించే ప్రయత్నం చేశారు. ఇలా అరకొరగా వచ్చిన విత్తనాలను సర్దుబాటు చేసేందుకు వ్యవసాయశాఖ సిబ్బంది నానా తంటాలు పడ్డారు. అయితే కాయలు దక్కని రైతులు ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు. అడిగినన్ని కాయలు ఇవ్వకుంటే విత్తు ఎలా పడుతుందని రైతులు ప్రశ్నిస్తున్నారు. దీంతో పంపిణీ కేంద్రాల నుంచి తీవ్ర నిరాశతో వెను దిరుగుతున్నారు. కాగా జిల్లా వ్యాప్తంగా 21,884 మంది రైతులకు గాను 7069 క్వింటాళ్ల వేరుశనగ విత్తనం పంపిణీ చేసినట్లు అధికారులు వెల్లడించారు.

మొక్కలతోనే మనుగడ



చిత్తూరు కోర్టులో మొక్కలు నాటుతున్న జిల్లా జడ్జి అరుణ సారిక

చిత్తూరు అర్బన్ : మొక్కలు నాటి, వాటిని సంరక్షించడం ద్వారానే మానవ మనుగడ ఉంటుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక స్పష్టం చేశారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం చిత్తూరులోని న్యాయస్థానాల సముదాయంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ జీవితంలో మొక్కలను నాటి, సంరక్షించడం చేయాలన్నారు. అప్పుడే భావి తరాలకు మంచి వాతావరణం సాధ్యమవుతుందన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి భారతి మాట్లాడుతూ.. పర్యావరణ రక్షణ కోసం ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, పచ్చదనాన్ని పెంచాలన్నారు. అనంతరం జిల్లా జడ్జితో పాటు న్యాయమూర్తులు కలిసి మొక్కలను నాటారు. కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ అధికారులు రాజశేఖర్, కుమార్, న్యాయమూర్తులు పాల్గొన్నారు.

అటల్ ల్యాబ్‌కు అమెరికా బృందం ప్రశంస



ల్యాబ్ పనితీరును ఆరా తీస్తున్న అమెరికా బృందం

శాంతిపురం : పాఠశాల స్థాయిలో అటల్ ల్యాబ్‌ల ద్వారా బోధన సాగుతున్న తీరును అమెరికాకు చెందిన ప్రతినిధి బృందం ప్రశంసించింది. అమెరికాలోని లెహిఘ్, స్విస్‌బర్న్ విశ్వవిద్యాలయాలకు చెందిన ప్రొఫెసర్లు ఎరిక్ ఒబేసేరరే, జాసన్ సార్జెంట్ గురువారం శాంతిపురం మండలంలోని కూతేగానిపల్లి వద్ద ఉన్న శ్రీ పరమహంస యోగానంద పాఠశాలను సందర్శించారు. అక్కడ ఉన్న అటల్ ల్యాబ్‌ను పరిశీలించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థుల లో సృజనాత్మకతను పెంచడానికి, ప్రాజెక్టు ఆధారిత బోధనతో అంశాలు నేర్చుకోవడానికి అటల్ ల్యాబ్‌లు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. కార్యక్రమంలో అమెరికా ప్రతినిధులు థియోడర్ స్పియర్, ఎమ్మా నజారియా, లిలియాగనా, నాడ్జిలీ జిమెనెజ్, స్థానిక ప్రిన్సిపల్ ఆజాద్ హుస్సేన్ పాల్గొన్నారు.

గత ప్రభుత్వంలో వైఎస్సార్ ఆసరా పథకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి (ఫైల్), నిండ్ర మండలం కొత్త ఆరూరులో పూర్తి అయిన ఇళ్ల నిర్మాణాలు





హామీలు దగా

- 143 హామీల్లో అయిదూ అమలు చేయని కూటమి సర్కారు
- పథకాలు అమలు చేయాలంటే భయమేస్తోందంటూ దాటవేత
- అన్నదాతలు, మహిళలకు వెన్నుపోటు
- వైఎస్సార్‌సీపీ పాలనలో మేనిఫెస్టోతో పాటు అదనపు హామీలు అమలు

ఎన్నికలకు ముందు అమలు కాని హామీలతో కూటమి మేనిఫెస్టోను సిద్ధం చేసి ఊరూరా ప్రచారం చేసింది. సూపర్– 6 సంక్షేమ పథకాలంటూ ప్రజలను బురిడీ కొట్టించింది. అధికారంలోకి వచ్చాక ఏడాది పూర్తి అయినా హామీలను అమలు చేయకుండా ప్రజలను నమ్మించి మోసగించింది. కూటమి పాలనపై విసిగిపోయిన ప్రజలు టీడీపీ మేనిఫెస్టో ఆ పార్టీకి టిష్యూ పేపరే అంటూ పెదవి విరుస్తున్నారు. ఏడాది పాలనలో కూటమి అమలు చేసిన మేనిఫెస్టో హామీల తీరుపై సాక్షి గ్రౌండ్ రిపోర్ట్ కథనం.



చిత్తూరు కలెక్టరేట్ : ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు కొత్తమి కాదు. 1994 ఎన్నికల్లో టీడీపీ మేనిఫెస్టోలో సంపూర్ణ మద్యపాన నిషేధం, రూ.2కే కిలో బియ్యం హామీలను తుంగలో తొక్కేశారు. మద్యపాన నిషేధాన్ని ఎత్తేసి, రూ.2కే కిలో బియ్యాన్ని రూ.5.50కి పెంచి ప్రజలను ఆ నాడే మోసం చేశారు. 1999 ఎన్నికల్లోనూ అదే కథ మళ్లీ అమలు చేశారు. ఇదే తంతు 2024 ఎన్నికల్లోనూ సూపర్ 6 అంటూ మేనిఫెస్టోలో పలు హామీలు పొందుపరిచారు. ఆ హామీలపై చంద్రబాబు, కుమారుడు నారా లోకేష్, దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్ ఇక కూటమి బ్యాచ్ మరోవైపు ఊరూరా తిరిగి అమాయకపు ప్రజలను బురిడీ కొట్టించారు. వారిని నమ్మి గత ఎన్నికల్లో అధికారం కట్టబెట్టిన ప్రజలను నమ్మించి మోసగించారు. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అయినా మేనిఫెస్టో హామీలు ఎందుకు అమలు చేయడం లేదని ప్రజలు ప్రశ్నిస్తుంటే సమాధానం చెప్పకుండా దాటవేస్తున్నారు. గత ఎన్నికల్లో కూటమి టీడీపీ మేనిఫెస్టోతో పాటు 143 హామీలు ఇచ్చారు. వాటిల్లో 5 హామీలను కూడా అమలు చేయకుండా ఘోరంగా విఫలమయ్యారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో పవిత్ర గ్రంథంగా..

గ్రౌండ్ రిపోర్ట్

2019 ఎన్నికలకు ముందు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు పేరుతో పలు హామీలను ప్రకటించి మేనిఫెస్టోను ప్రకటించారు. 2019లో ఎన్నికల్లో గెలిచాక ఇచ్చిన మాట ప్రకారం ఆ మేనిఫెస్టోను ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రతి సచివాలయంలో పొందుపరిచారు. రెండున్నర సంవత్సర కాలంలో కరోనా విలయ తాండవం చేయడంతో ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం అయ్యింది. అలాంటి పరిస్థితుల్లోనూ ప్రజలకు ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేసి సంక్షేమ పథకాలను అమలు చేశారు.

వైఎస్సార్ స్ఫూర్తిగా....
దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి స్ఫూర్తితో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందరికీ మేలు చేకూర్చేలా 2019వ సంవత్సరం నుంచి 2024 వరకు ప్రకటించిన మేనిఫెస్టో ప్రకారం నవరత్నాల సంక్షేమ పథకాలను ఏటా అమలు చేసి చూపించారు. ఏటా వైఎస్సార్ రైతు భరోసా, వైఎస్సార్ ఆసరా, పింఛన్ల పెంపు, అమ్మఒడి, పేదలందరికీ ఇళ్లు, ఆరోగ్య శ్రీకి పూర్వ వైభవం, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి హామీలను తప్పకుండా అమలు చేసి నిరూపించారు.



తిరుపతిలో ఇళ్ల పట్టాలు అందుకున్న ఆనందంలో సెల్ఫీ తీసుకుంటున్న మహిళలు(ఫైల్)

అలంకారప్రాయంగా కూటమి మేనిఫెస్టో

కూటమి టీడీపీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అయ్యింది. ఎన్నికల సమయంలో కూటమి మేనిఫెస్టోను ఆ పార్టీ విడుదల చేసింది. ఆ మేరకు సూపర్ 6 హామీలు గుప్పించారు.

- యువతకు 20 లక్షల ఉద్యోగాలు/నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి అన్నారు. ఏడాది పూర్తి కావొస్తున్నా జిల్లాలో ఉద్యోగాలు లేవు..భృతి కానరాదు. జిల్లాలో గత 12 నెలలుగా దాదాపు 75810 మంది నిరుద్యోగ యువత రూ.272.91 కోట్లు నష్టపోయారు.
- స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి తల్లికి వందనం కింద ఏడాదికి రూ.15 వేలు చొప్పున ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అంతమందికి ఇస్తామన్నారు. ఏడాది పూర్తి అయినా ఏ ఒక్క విద్యార్థికీ ఆ నగదు అందలేదు. దీంతో ఈ ఏడాదిలో జిల్లాలో 1,52,879 మంది విద్యార్థులు రూ.229.32 కోట్లను నష్టపోయారు.
- ప్రతి రైతుకు ఏటా రూ.20 వేలు ఆర్థిక సాయం అందిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఈ పథకం అమలు చేయకపోవడంతో వేల మంది రైతులు అప్పులపాలయ్యారు. దీంతో జిల్లాలోని 2,20,879 మంది రైతులకు రూ.441.76 కోట్లు ఇవ్వకుండా మోసగించారు.
- ప్రతి మహిళకు ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1500 చొప్పున అందజేస్తామన్నారు. ఈ పథకం అమలు కాకపోవడంతో జిల్లాలోని 9.33 లక్షల మంది మహిళలు నష్టపోయారు. వీరికి అందించాల్సిన రూ.1679.40 కోట్లను ఇవ్వకుండా ఎగ్గొట్టేశారు.
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అని హామీ ఇచ్చారు. ఈ హామీని అమలు 2024 ఆగస్టులో అమలు చేయనున్నట్లు చిత్తూరు ఎమ్మెల్యే నగరంలో పెద్ద బ్యానర్లు వేయించి ప్రచారం చేశారు. తీరా ఏడాది పూర్తి అవుతున్నా ఉచిత బస్సు ప్రయాణం అమలు లేదు.


ముందుమాట


ప్రజాగళం పేరుతో కూటమి టీడీపీ రూపొందించిన మేనిఫెస్టో

జిల్లాలో కూటమి సూపర్ 6 పథకం అమలు కాక నష్టపోయిన లబ్ధిదారుల వివరాలు

పథకం	లబ్ధిదారులు	ఏడాదికి నష్టం (రూ.కోట్లలో)
ఆడబిడ్డ నిధి	9.33 లక్షలు	1679.40
తల్లికి వందనం	1.52 లక్షలు	229.32
ఉచిత బస్సు	9.33 లక్షలు	189.26
నిరుద్యోగ భృతి	75,810 వేలు	272.91
అన్నదాత సుఖీభవ	2.20 లక్షలు	441.76

వైఎస్సార్‌సీపీ పాలనలో మేనిఫెస్టో మొదటి సంవత్సరం అమలు చేసిన పథకాలు

పథకం పేరు	లబ్ధిదారులు	ఖర్చు చేసిన మొత్తం (రూ.కోట్లలో)
వసతిదీవెన	41,313	80.25
విద్యాదీవెన	42,991	91.67
అమ్మఒడి	1,52,743	229.12
విద్యాకానుక	1,95,855	32.67
రైతుభరోసా	2,16,594	162.45
ఆరోగ్యశ్రీ	42,908	125.61
ఆరోగ్య ఆసరా	26,389	13.44
రూరల్‌లో సున్నావడ్డీ	95,994	196.98
పింఛన్‌కానుక	4,65,895	2065.07
చేయూత రూరల్‌లో	1,72,616	323.66
ఆసరా రూరల్‌లో	2,70,197	568.51
తోడు రూరల్‌లో	33,607	33.61
సున్నావడ్డీ అర్బన్‌లో	12,933	19.90
చేయూత అర్బన్‌లో	19,144	35.90
కోవిడ్ ఆర్థిక సహాయం	16,79,923	56.33



నగరి అర్బన్ లే అవుట్‌లో ఇళ్ల నిర్మాణాలు

ఇచ్చిన హామీలను అమలు చేయాలి



ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చారు. ఇప్పుడే ఆ హామీలు అమలు చేకుండా తప్పించుకుంటున్నారు. ఏడాది పూర్తి అయ్యింది. మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం హామీలు అమలు చేయాలి కదా. ఎందుకు అమలు చేయడం లేదని అడుగుతున్నాం.
– దీప, పాలసముద్రం

జగనన్న సాయం మరువలేం



మా కుమారుడు లోకేష్ యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో ఉన్నత చదువులు చదవడానికి సీటు వచ్చింది. ఆ యూనివర్శిటీలో మొత్తం రూ.27.54 లక్షలు ఫీజు కాగా ఇందులో మొదటి విడతగా జగనన్న విదేశీ విద్యా దీవెన కింద రూ.3.4 లక్షలు అందజేశారు. ఆ సాయం ఎప్పటికీ మరువలేం.
– కృష్ణారెడ్డి, రామకుప్పం మండలం

ఎంతో ఉపయోగకరం



నాకున్న రెండెకరాల పొలంలో వరి సాగు చేశా. అకాల వర్షాలతో నష్టపోగా గత వైఎస్సార్‌సీపీ సర్కారు అందజేసిన రైతుభరోసాతో పంట పెట్టుబడికి ఆ డబ్బులు ఎంతో ఉపయోగపడాయి. ప్రస్తుత కూటమి హామీలను అమలు చేయాలి.
– గణేష్, రైతు, అయ్యప్పగారిపల్లి, పూతలపట్టు

కౌలు రైతుకు భరోసా



మాది బంగారుపాళ్యం మండలం కాటప్పగారిపల్లి. ఎకరా పొలాన్ని కౌలుకు తీసుకుని టమోట వేస్తుంటాం. రైతు భరోసా పథకం మాకు ఆదరవుగా ఉండేది. మాకు అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, సున్నావడ్డీ పథకాలు అందాయి. కూటమి ఏ హామీలు అమలు చేయలేదు.
– కళావతి, మహిళా రైతు, బంగారుపాళ్యం మండలం

ఆర్థిక భారం తగ్గింది



గత వైఎస్సార్‌సీపీ సర్కారులో అందజేసిన సున్నా వడ్డీ పథకం మాకు అండగా నిలిచింది. నేను దాదాపు 7 సార్లు బ్యాంకు లింకేజీ తీశాము. జనవరిలో రూ. 2 లక్షల బ్యాంకు లింకేజ్ తీశా. మాకు వై.ఎస్.ఆర్ ఆసరా 34,500 వచ్చింది. సున్నా వడ్డీ 8,500 వచ్చింది. అమ్మ ఒడి, రైతు భరోసా వచ్చింది.
– బి.జ్యోతి, చిత్తూరు మండలం

ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



కూటమి టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన మాటను తప్పనిసరిగా నిలబెట్టుకోవాలి. తల్లికి వందనం అమలు చేస్తారని ఆశతో ఎదురు చూశాం. తీరా ఏడాది పూర్తి అవుతున్నా ఆ పథకం అమలు కాలేదు. ఆడబిడ్డ నిధి, ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు. అవి కూడా ఇంత వరకు అతి గతి లేదు.
– శాంతి, కార్వేటినగరం మండలం

స్నేహ విలాపం

- ఈతకు వెళ్లి ముగ్గురు బాలురు మృతి
- కాపాడేందుకు మిత్రుని విఫలయత్నం
- శోకసంద్రంలో మోట్లపల్లి

ఆ పిల్లవాడికి పట్టుమని పన్నెండేళ్లు కూడా లేవు. కానీ తోటి స్నేహితులు మునిగిపోతుంటే తట్టుకోలేక పోయాడు. వారిని కాపాడేందుకు విశ్వప్రయత్నాలు చేశాడు. కానీ విధి వారి స్నేహ బంధాన్ని చూసి ఓర్వలేకపోయింది. నలుగురు స్నేహితుల్లో ముగ్గురిని ముంచేసి తనలో కలిపేసుకుంది. తోటి స్నేహితులు దూరం అవ్వడంతో ఆ పసి హృదయం తల్లడిల్లి పోయింది. ఈ విషాద ఘటన వి.కోట మండలం, మోట్లపల్లిలో తీరని విషాదాన్ని మిగిల్చింది.

వి.కోట : అయ్యో దేవుడా ఎంత పని చేశావు.. అప్పుడే నిండు నూరేళ్లు నిండిపోయాయా... నాబిడ్డ బదులు నన్ను తీసుకు పోరాదా సామీ.. ఏమి ఈ ఘోరం మేము ఇంక ఎట్లా బతికేది అంటూ తల్లిదండ్రుల రోదనలతో మోట్లపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. జిల్లాలోని వి.కోట మండలంలోని కృష్ణాపురం పంచాయతీ మోట్లపల్లి గ్రామానికి చెందిన ముగ్గురు బాలురు చెరువులో ఈతకు వెళ్లి మృతి చెందిన సంఘటన మండలంలో గురువారం చోటు చేసుకుంది.

గుంత గమనించకపోవడంతో..
గురువారం మధ్యాహ్నం మోట్లపల్లి గ్రామానికి చెందిన రెడ్డెప్ప, చంద్రకళ దంపతుల కుమారుడు 9వ తరగతి చదువుతున్న కుశాల్ (14), చంద్రశేఖర్, కవిత దంపతుల కుమారుడు 8వ తరగతి చదువుతున్న నిఖిల్(13), ఆదెప్ప, బేబీ దంపతుల కుమారులు 5వ తరగతి చదువుతున్న జగన్ (9), 7వ తరగతి చదువుతున్న పూర్ణేష్ (12) నలుగురు పిల్లలు అదే గ్రామంలోని చెరువుకు సరదాగా ఈతకు వెళ్లారు. ముగ్గురు బాలురు చెరువులో ఓ చోట గుంత లోతుగా ఉండడంతో అక్కడ ఈతకు వెళ్లి బయటకు రాలేక పోయారు.



మోట్లపల్లి వద్ద ముగ్గురు పిల్లల ప్రాణాలను బలిగొన్న చెరువులోని గుంత ఇదే (ఇన్‌సెట్‌లో) చిన్నారులు కుశాల్, నిఖిల్, జగన్ (ఫైల్ ఫొటోలు)

ఫలించని బాలమిత్రుని ప్రయత్నం
పూర్ణేష్ కాలకృత్యాలు తీర్చుకునేందుకు చెరువు వద్దకు వెళ్లి వచ్చేలోపు.. తనతో పాటు సరదాగా ఈత కొట్టేందుకు వచ్చిన ముగ్గురు స్నేహితులు నీటి కుంటలో మునిగిపోతున్నారు. ఆ క్షణంలో ఆ బాలుడికి దిక్కుతోచలేదు. మిత్రులకు ఏమైందో తెలియని బాధ.. ఓవైపు భయం.. ఎలాగైనా వారు సురక్షితంగా పైకి రావాలనే ఆకాంక్ష.. కన్నీరు ఆగలేదు.. సాయం చేయడానికి దరిదాపుల్లో ఎవరూ లేరు. పక్కనున్న చెట్లు కొమ్మలు.. చెట్ల తీగలు సేకరించాడు. కుంటలోకి విసిరి మిత్రులను పైకి రప్పించడానికి విశ్వ ప్రయత్నం చేశాడు.. ఉపయోగం లేక ఊరిలోకి పరుగులు తీశాడు. గ్రామస్తులకు విషయం చెప్పాడు. కానీ ఆ పన్నెండేళ్ల బాల మిత్రుడి ప్రయత్నం ఫలించలేదు. హుటాహుటిన గ్రామస్తులు చెరువు వద్దకు వెళ్లిన సమయానికే ముగ్గురు బాలురు చెరువు గుంతలోని నీటిలో మునిగిపోయారు. చెరువులో గాలించి బయటకు తీసేసరికి ముగ్గురు బాలురు మృతి చెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలను సేకరించి కేసు నమోదు చేసుకుని ముగ్గురు బాలురుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు సీఐ తెలిపారు.

మోట్లపల్లిలో విషాద ఛాయలు
ఈ సంఘటనతో మోట్లపల్లి గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది. ముగ్గురు చిన్నారుల మృతితో తల్లిదండ్రుల ఆర్తనాదాలు మిన్నంటాయి. తల్లడిల్లుతున్న తల్లిదండ్రులను ఓ దార్చడం ఎవరితరం కాలేదు. ఒకే గ్రామంలో ముగ్గురు పిల్లలు మృతి చెందడంతో మండలంలో తీవ్ర విషాదం అలుముకుంది.

గుండెలు బాదుకుంటూ రోదిస్తున్న కుటుంబ సభ్యులు





క్లుప్తంగా

బడులకు సన్న బియ్యం

కాణిపాకం: జిల్లాలోని ప్రభుత్వ బడులు, వసతి గృహాలకు రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేయనుంది. ఇందులో భాగంగా చిత్తూరు జిల్లాకు 460 టన్నుల బియ్యం కేటాయించింది. జిల్లాలోని 8 ఎంఎల్ఎస్ పాయింట్లకు బియ్యం చేరినట్టు అధికారులు తెలపారు. అక్కడి నుంచి 2135 ప్రభుత్వ బడులు, 31 వసతి గృహాలకు సరఫరా చేయనున్నట్టు వెల్లడించారు. బియ్యాన్ని జిల్లా పౌరసరఫరాలశాఖ మేనేజర్ బాలక్రిష్ణ పరిశీలించారు.

నేడు ఎస్జీటీలకు ఉద్యోగోన్నతుల ప్రక్రియ

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా ఈనెల 6 వ తేదీన ఉద్యోగోన్నతుల ప్రక్రియ నిర్వహించనున్నట్లు డీఈవో వరలక్ష్మి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఎస్జీటీలు, పీఈటీలకు ఉద్యోగోన్నతుల ప్రక్రియ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రక్రియలో మొదటగా సీనియారిటీ జాబితా ప్రకారం 1:3 ప్రాతిపదికన సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందన్నారు. సంబంధిత టీచర్లు శుక్రవారం చిత్తూరులోని డీఈవో కార్యాలయం పక్కన ఉన్న ప్రభుత్వ పాఠశాలకు సర్టిఫికెట్ల పరిశీలనకు ఉదయం 10 గంటలకు హాజరుకావాలన్నారు. పరిశీలన అనంతరం కౌన్సెలింగ్ నిర్వహించి ఉద్యోగోన్నతులు కల్పిస్తారని డీఈవో పేర్కొన్నారు.

యోగాకు సన్నద్ధం

చౌడేపల్లె : బోయకొండ గంగాపురంలోని గోశాల సమీపంలో ఈనెల 9న సోమవారం యోగా నిర్వహణకు చర్యలు చేపట్టినట్లు పలమనేరు ఆర్డీఓ భవాని తెలిపారు. గురువారం పర్యాటకశాఖ జిల్లా అధికారిణి గౌరి, బోయకొండ ఈఓ ఏకాంబరంతో కలిసి స్థల పరిశీలన చేశారు. గోశాల వద్ద గల స్థలంలో యోగా నిర్వహించడానికి ఏర్పాట్లపై చర్చించారు. సుమారు 2 వేల మందికి పైగా ఈ కార్యక్రమానికి తరలిరానున్నారని ఆ దిశగా ఏర్పాట్లు చేసేందుకు అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. ఆమె వెంట తహశీల్దార్ హనుమంతునాయక్, ఎంపీడీఓ లీలామాధవి, పంచాయతీ కార్యదర్శి పవన్ కుమార్ తదితరులున్నారు.

శ్రీవారి దర్శనానికి 16 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. క్యూకాంప్లెక్స్‌లోని 25 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 78,288 మంది స్వామిని దర్శించుకున్నారు. 32,079 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.67 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 16 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉండగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ముందుగా వెళ్లిన వారిని క్యూలోకి అనుమతించరని స్పష్టం చేసింది.

సిఫార్సుల దందా!

- కాణిపాకంలో ఇష్టారాజ్యంగా సిఫార్సు దర్శనాలు
- మితిమీరుతున్న దళారుల పెత్తనం
- కొందరు అధికారులు, సిబ్బంది ప్రమేయం
- ఆలయ ఆదాయానికి భారీగా గండి
- సిఫార్సు దర్శనాలు నిలువరించేందుకు చర్యలు

తేదీ	భక్తుల సంఖ్య	విరాళం (రూ.లలో)	టిక్కెట్ల ద్వారా ఆదాయం (రూ.లక్షల్లో)
19-05-2025	12,964	11,566	6.11
20-05-2025	11,752	67,663	5.81
23-05-2025	17,638	3,96,571	8.42
24-05-2025	21,894	2,14,357	12.64

కాణిపాకం : వరసిద్ధి క్షేత్రంలో కొందరు అధికారులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దళారులను పెంచి పోషిస్తున్నారు. వీరి కలయికతో సిఫార్సు దర్శనాలు పోటెత్తుతున్నాయి. ఫలితంగా ఆలయ ఆదాయానికి గండి పడుతోంది. ఆలయ ఆదాయం క్షీణించడంతో ఆలయ ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. సిఫార్సు దర్శనాలకు బ్రేక్ వేసేందుకు ముందడుగు వేస్తున్నారు. అయితే సిఫార్సు దర్శనాలు కొనసాగించేందుకు కొందరు అధికారులు, సిబ్బంది కుట్ర పన్నుతున్నారు.

ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం కూడా ఒకటిగా వెలుగొందుతోంది. ఈ క్షేత్రాన్ని దర్శించడానికి దేశ నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివస్తుంటారు. అలాగే విదేశాల నుంచి వేల మంది వస్తారు. 2022లో ఆలయ జీర్ణోద్ధరణ తర్వాత భక్తుల సంఖ్య బాగా పెరిగింది. ప్రస్తుతం సాధారణ రోజుల్లో భక్తుల సంఖ్య 10 వేలు దాటుతోంది. శని, ఆదివారాల్లో భక్తుల సంఖ్య 30 వేలకుపైగా నమోదవుతోంది. బ్రహ్మోత్సవాల సమయంలో 80 వేలకు చేరుతోంది. ఇది అధికారికంగా నమోదయ్యే భక్తుల సంఖ్య. అనధికారికంగా వచ్చే భక్తుల సంఖ్య కూడా రోజు వారీగా వేల మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

రోజు 3 వేల మంది దాకా..

కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో కొందరు అధికారులు, సిబ్బంది సిఫార్సు దర్శనాలను ప్రోత్సాహిస్తున్నారు. అత్యవసరంగా, సులభంగా దర్శనం చేసుకోవాలని వచ్చే భక్తులను టార్గెట్ చేస్తున్నారు. కాపు కాచి వారికి అతిశీఘ్ర, ప్రత్యేక దర్శనం చేయిస్తామని వల వేస్తున్నారు. అలా వల వేసి స్వామి దర్శనాన్ని ఆదాయ వనరుగా మార్చుకుంటున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల నుంచి భారీగా గుంజుతున్నారు. బంధువులు, తెలిసిన వ్యక్తులంటూ నమ్మించి ఈ సిఫార్సు దర్శనాలకు ఆజ్యం పోస్తున్నారు. అలాగే లాడ్జీలు, ట్రావెల్స్ వారితో చేతులు కలిపి సిఫార్సు దర్శనాలను తేలికగా మార్చేశారు. దళారులను పెంచి పోషిస్తున్నారు. వీరి ద్వారా వచ్చే సిఫార్సు దర్శనాలను నేరుగా అంతరాలయం వరకు తీసుకెళ్తున్నారంటే సిఫార్సు దర్శనాలు ఏ పాటివో ఇట్టే బోధ పడుతుంది. ఇందులో కొందరు ఆలయ అధికారులు, సిబ్బంది, హోంగార్డులు, సెక్యూరిటీ సిబ్బంది కీలకంగా వ్యవహరిస్తున్నట్లు అధికారుల దృష్టికి వెళ్లింది. దళారులతో వచ్చే వారిని వీఐపీ గేటు నుంచి అంతరాలయం వరకు చకచకా తీసుకెళ్లి దర్శనం చేయిస్తున్నారు. ఇలా ఒకరిద్దరూ కాదు.. పదుల సంఖ్యలో గ్రూపులుగా తీసుకెళ్లి దర్శనాలు చేయిస్తున్నారు. రోజువారీగా సిఫార్సులతో దర్శనం చేసే వారు 3 వేల మంది వరకు ఉండవచ్చునని అధికారులు లెక్క గట్టారు.

దర్శనానికి రూ.2 వేలు

ఆలయ సిబ్బంది మాదిరిగానే దళారులు సైతం తెల్ల చొక్కా..పంచె కట్టుకుని పెద్ద మనుషులుగా తిరుగుతుంటారు. స్వామి దర్శనాలు చేయించడమే పనిగా పెట్టుకున్నారు. ఒక్క దర్శనానికి రూ.1000 నుంచి రూ.2000 తీసుకుంటున్నారు. అలా వచ్చిన ఆదాయంలో వాటాలు పంచుకుంటున్నారు. ఇవన్నీ ఆలయ ఆవరణలో కళ్ల ఎదుటే కనిపిస్తుంటాయి. నిఘా నేత్రాన్ని కూడా వీళ్లు లెక్కచేయకుండా దర్జాగా వారి దందాను నడిపిస్తున్నారు. వీటిని కట్టడి చేయడానికి గత ప్రభుత్వంలో సిఫార్సులతో వచ్చే భక్తులకు అవగాహన కల్పించడం ప్రారంభించారు. రూ.150 టిక్కెట్లు తీసుకుని సులభతరంగా దర్శనం చేయించడానికి ప్రయత్నించారు. దళారులను నమ్మొద్దని తెలియజేసేవారు. గత 9 నెలలుగా ఆలయ దర్శనం గందరగోళంగా మారింది.

చేతులు మారుతున్న తాళం

అంతరాలయ దర్శన తాళాలు ఉండాల్సిన వారి చేతిలో కాకుండా చేతులు మారుతున్నాయి. అక్కడి అధికారులు, సిబ్బంది, ఇతర వ్యక్తులు ఎవరికి వారు తాళాలు తెరుకుని అంతరాలయ దర్శనానికి దర్జాగా తీసుకెళుతున్నారు. అడిగితే వాళ్ల పేరు..వీళ్ల పేరు చెప్పి తాళం ఉన్న సిబ్బందిని బెదిరిస్తున్నారు. దీంతో ఏం చేయాలో తెలియక వారు మిన్నుకుండిపోతున్నారు. మనకెందుకొచ్చిన గొడవ అంటూ తాళాలు ఇచ్చేస్తున్నారు. దీంతో ఆలయ నిబంధనలు గాడి తప్పుతున్నాయి.


కాణిపాక దేవస్థానం


దర్శనానికి బారులు తీరిన భక్తులు

కట్టడికి అధికారుల ప్రయత్నం

అధికారులు, సిబ్బంది వ్యవహార శైలి, దళారుల ప్రమేయంపై ఉన్నతాధికారులు కొన్ని రోజులుగా నిఘ పెట్టారు. ఇందులో అసలు విషయాలు బయటపడ్డాయి. ఆలయ అధికారులు, సిబ్బందిని పిలిచి సమావేశం నిర్వహించారు. సిఫార్సు దర్శనాలను ప్రోత్సాహించ వద్దని హెచ్చరించారు. కచ్చితంగా భక్తులు టిక్కెట్లు కొని దైవ దర్శనం చేయించుకునేలా చూడాలని ఆదేశాలిచ్చారు. దీంతో సిఫార్సు దర్శనాలు కాస్త తగ్గుముఖం పట్టాయి. టిక్కెట్లు తీసుకుని వెళ్లాలని చెబుతున్నారు. పూర్తి స్థాయిలో సిఫార్సు దర్శనాలకు అడ్డుకట్ట వేయాలని అధికారులు సంసిద్ధమవుతున్నారు. దీనిపై కొందరు విష ప్రచారం మొదలు పెట్టారు. సిఫార్సు దర్శనాల బ్రేక్ వేసే ప్రక్రియను అడ్డుకోవాలని చూస్తున్నారు. అయినా ఆలయ అధికారులు మాత్రం ఆలయ ఆదాయానికి డోకా లేకుండా చూడాలని భావిస్తున్నారు. ఇదీ ఏ మేర ఫలిస్తుందో వేచి చూడాల్సిందే.

అందరూ సహకరించాలి



సిఫార్సు దర్శనాలను కట్టడి చేసేందుకు చర్యలు తీసుకున్నాం. ఇది వరకే ఆలయ అధికారులు, సిబ్బందికి సమావేశం నిర్వహించి చెప్పాం. సిఫార్సు దర్శనాలను ప్రోత్సహించ వద్దని ఆదేశాలు ఇచ్చాం. కొంత వరకు మార్పు వచ్చింది. పూర్తి స్థాయిలో మార్పు తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. ఆలయ ఆదాయం పెంపునకు కృషి చేస్తున్నాం. అందరూ సహకరించాలి. ఏవైనా సమస్యలుంటే తీసుకొస్తే కచ్చితంగా వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తాం. – పెంచల కిషోర్, ఈఓ, కాణిపాకం

దొంగల ముఠా కోసం గాలింపు

- పోలీసుల అదుపులో ముఠా సభ్యుడు

కుప్పం రూరల్ : హరియాణా దొంగల ముఠాకు చెందిన స్కార్పియో వాహనం కుప్పం వైపునకు వస్తోందని కుప్పం పోలీసులకు సమాచారం వచ్చింది. స్కార్పియో వాహనాన్ని ఆపేందుకు కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్, గుడుపల్లె ఎస్ఐ శ్రీనివాసులు వాహనాన్ని ఆపేందుకు ప్రయత్నించగా, దొంగలు ఎస్ఐ వాహనాన్ని ఎక్కించేందుకు ప్రయత్నించారు. వెంటనే సీఐ మల్లేష్‌యాదవ్ దొంగలపై ఓ రౌండ్ కాల్పులు జరిపారు. అయినా దొంగలు వాహనాన్ని ఆపకుండా నేషనల్ హైవే నుంచి పరమసముద్రం వైపు వెళ్లి వాహనం వదిలి దొంగలు తప్పించుకున్నారు. మంగళవారం రాత్రి నుంచి కుప్పం పోలీసులు హరియాణా దొంగల ముఠా కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

● గాలింపు చర్యల్లో భాగంగా కుప్పం పోలీసులు గురువారం ఉదయం కుప్పం రైల్వే స్టేషన్‌లో తనిఖీ చేస్తుండగా బెంగళూరుకు పారిపోయేందుకు సిద్ధంగా ఉన్న దొంగల ముఠాలోని ఓ సభ్యుడిని పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. దొంగలు హైవే ద్వారా తమిళనాడు వెళ్లే మార్గాల్లో పోలీసులు సీసీ కెమెరాలు చెక్ చేస్తున్నారు. మరో నాలుగు బృందాలు అడవులు, గ్రామాల్లో తిరుగుతూ దొంగల ముఠా కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

ఏపీ ప్రభుత్వ ఉద్యోగ సంఘ రాష్ట్ర పాధ్యక్షుడిగా లక్ష్మీపతి

తిరుపతి కల్చరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అటవీశాఖాధికారి ఎస్. లక్ష్మీపతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడలోని ఎస్ఎస్ కన్వెన్షన్‌లో గురువారం ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఎన్నికలు నిర్వహించారు. జ్యూడిషల్ రామచంద్రరావు ఎన్నికల అధికారిగా, కమర్షియల్ ట్యాక్స్ అధికారి సత్యనారాయణ ఉప ఎన్నికల అధికారిగా, బుజంగరావు, ఆయుష్ అబ్జర్వర్లుగా వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో రాష్ట్ర అధ్యక్షుడిగా కేఆర్.సూర్యనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రమేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నాగసాయి, కోశాధికారిగా రామారావు, ఉపాధ్యక్షుడిగా లక్ష్మీపతి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్, సినిమాటోగ్రాఫ్ మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్సీ రాజశేఖర్ హాజరయ్యారు.

ఘనంగా ఖరీఫ్ విత్తన దినోత్సవం


రైతులకు విత్తనాలను అందజేస్తున్న ఏడీఆర్ డాక్టర్ సుమతి, శాస్త్రవేత్తలు

తిరుపతి సిటీ: తిరుపతిలోని ఎన్జీరంగా వర్సిటీ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో గురువారం ఖరీఫ్ విత్తన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ వి.సుమతి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ నూతన విత్తనాల ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. క్రాప్ విభాగాధిపతి డాక్టర్ కే జాన్ మాట్లాడుతూ వేరుశనగ, అపరాలు, నువ్వులు, చిరుధాన్యాలలో ఖరీఫ్ పంట కాలానికి అనువైన నూతన రకాలు, వాటి గుణగణాలు, విత్తన శుద్ధి, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు పలు రకాల విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కీటక శస్త్ర విభాగాధిపతి డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ భారతి, డాక్టర్ అమరావతి, శ్రీవల్లిదేవి, మహేశ్వరరెడ్డి, తిరుపతి, చిత్తూరు జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో డీజీపీ కుటుంబ సభ్యులు


ఆలయం వద్ద డీజీపీ హరీష్‌గుప్తా కుటుంబ సభ్యులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని రాష్ట్ర డీజీపీ హరీష్‌గుప్తా కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేపట్టారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థ ప్రసాదలు అందజేశారు.

ముక్కంటి సేవలో గవర్నర్ కార్యదర్శి


ఆలయం వద్ద గవర్నర్ కార్యదర్శి

జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ కార్యదర్శి డాక్టర్ హరిజవలాల్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఈవో బాపిరెడ్డి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

ఒకే ఒక్కడు

పేదల సొంతింటి కల సాకారం


గత వైఎస్సార్‌సీపీ సర్కారులో మంజూరు చేసిన పక్కా గృహాలు

చిత్తూరు కలెక్టరేట్ : పేదల సొంతింటి కలను గత వైఎస్సార్‌సీపీ సర్కారు సాకారం చేసింది. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో జిల్లాలోని పేద ప్రజలకు ఉచిత ఇళ్ల స్థలాలతో పాటు పక్కా గృహాలను మంజూరు చేసింది. ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు విడుదల చేయడంతో పాటు అదనంగా హౌసింగ్ రుణాలను మంజూరు చేసింది. ఇంటి నిర్మాణానికి అవసరమైన మెటీరియల్‌ను రాయితీపై అందజేసింది. అంతే కాకుండా ఒక్కో ఇంటి నిర్మాణానికి ఉచితంగా 20 టన్నుల ఇసుకను సరఫరా చేసింది. రాయితీ పై మార్కెట్ ధర కన్నా తక్కువకు 140 బస్తాల సిమెంట్, 480 కిలోల ఐరన్‌తో సహా ఇతర సామగ్రిని గత వైఎస్సార్‌సీపీ అందజేసింది. గత ఐదేళ్లపాటు అమలు చేసిన నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకం దేశ చరిత్రలోనే చారిత్రకంగా నిలిచింది. ఈ పథకాన్ని అమలు చేసిన పూర్వపు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్ర చరిత్రలో ఒకే ఒక్కడుగా నిలిచారు.

జిల్లాలో ఇళ్ల నిర్మాణాలకు అందజేసిన హౌసింగ్ రుణాల వివరాలు

నియోజకవర్గం	గృహాలు మంజూరైన లబ్ధిదారులు	హౌసింగ్ రుణాలు పొందిన మహిళలు	ఖర్చు చేసిన మొత్తం (రూ.లక్షల్లో)
నగరి	2,006	1,847	578.77
చిత్తూరు	3,551	3,075	961.50
కుప్పం	4,307	3,515	1132.12
పూతలపట్టు	12,061	5,498	2008.52
పలమనేరు	8,863	7,007	2088.56
జీడీ నెల్లూరు	12,505	7,220	2520.01
పుంగనూరు	14,083	6,736	2615.07

నేటి నుంచే డీఎస్సీ పరీక్షలు

- ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ అధికారులు
- చిత్తూరు జిల్లాలో 4, చెన్నైలో 4 కేంద్రాలు ఏర్పాటు

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు జిల్లా, తమిళనాడు రాష్ట్రం చెన్నైలో శుక్రవారం నుంచి డీఎస్సీ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలకు జిల్లా విద్యాశాఖ అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఈ పరీక్షలకు చిత్తూరు జిల్లాలో 4, తమిళనాడు రాష్ట్రం చెన్నైలో 4 మొత్తం 8 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. జూన్ 6వ తేదీ నుంచి జూన్ 30వ తేదీ వరకు పరీక్షలను నిర్వహించనున్నారు.

22,046 మంది అభ్యర్థులు

డీఎస్సీ పరీక్షలకు 22,046 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. తమిళనాడు రాష్ట్రం చెన్నై లో 1484 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు. ఈ పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నారు. పరీక్షల నిర్వహణలో సందేహాల నివృత్తి కోసం 90321 85001 నంబర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు.

ప్రశాంత వాతావరణంలో పరీక్షల నిర్వహణ



డీఎస్సీ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని విద్యాశాఖ అధికారులనుకు ఆదేశించాం. పరీక్షలు రాసే అభ్యర్థులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా మౌలిక వసతులు కల్పించాలని చెప్పడం జరిగింది. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య చికిత్సల నిమిత్తం ఏఎన్ఎంలు అందుబాటులో ఉండాలని ఆదేశించాం. డీఎస్సీ అభ్యర్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసి టీచర్ కొలువులు సాధించాలి. – సుమిత్ కుమార్ గాంధీ, కలెక్టర్

జిల్లాలో 30 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం

- డీఎఫ్ఓ భరణి


పిల్లల పార్కులో జరుగుతున్న పనుల గురించి చర్చిస్తున్న డీఎఫ్ఓ

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో వర్షాకాలం ప్రారంభమయ్యే సమయానికి 30 లక్షల మొక్కలు నాటడం లక్ష్యంగా నిర్దేశించుకున్నామని జిల్లా అటవీ శాఖ అధికారి భరణి తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని గురువారం నీవా నగరవనంలోని పిల్లల పార్కులో మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణకు అందరూ మొక్కలు నాటాలని కోరారు. అలాగే, ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ మాట్లాడారు. అనంతరం వివిధ అంశాలపై నిర్వహించిన పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. లయన్స్‌క్లబ్ సభ్యులు అందజేసిన సీడ్ బాల్స్‌ను నగరవనంలో వేశారు. కలెక్టర్ నిధులు రూ.10 లక్షలతో జరగుతున్న పనులను ఆమె పరిశీలించారు. ఆటవస్తువులు, అడ్వెంచర్ గేమ్స్‌కు సంబంధించిన వస్తువుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. త్వరలో వీటిని కలెక్టర్ చేతులమీదుగా ప్రారంభించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, ఎఫ్ఆర్వోలు బాలకృష్ణరెడ్డి, థామస్, డీఆర్వో ఆనంద్‌రెడ్డి, కరణ్‌సింగ్, ఎఫ్ఎస్వో ఉష, ఎఫ్‌బీఓలు రెడ్డెప్ప, ఢిల్లీరాణి, సతీష్, గౌస్‌బాషా, మధు తదితరులు పాల్గొన్నారు.


కుమారుడు సిద్ధార్థ్‌తో కలిసి మొక్క నాటుతున్న డీఎఫ్ఓ భరణి

రేపటి నుంచి అమ్మవారి తెప్పోత్సవాలు

చంద్రగిరి: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాలను శనివారం నుంచి 11వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను ఆలయ అధికారులు శరవేగంగా పూర్తిచేస్తున్నారు. ఈ ఉత్సవాల్లో శ్రీ అలమేలు మంగమ్మ పద్మసరోవర తీరంలో పాంచరాత్ర ఆగమ పూజలు అందుకుని భక్తులను అనుగ్రహించనున్నారు. ప్రతి సంవత్సరం అమ్మవారికి జ్యేష్ఠశుద్ధ ఏకాదశి నుంచి పౌర్ణమి వరకు తెప్పోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

తెప్పోత్సవాల వివరాలు

శనివారం మొదటి రోజు రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామి, రెండో రోజు శ్రీసుందరరాజస్వామి, చివరి మూడు రోజులు శ్రీ పద్మావతి అమ్మవారు తెప్పలపై విహరిస్తూ భక్తులకు అనుగ్రహించనున్నారు.

ఆర్జితసేవలు రద్దు

తెప్పోత్సవాల కారణంగా తిరుచానూరు అమ్మవారి ఆలయంలో ఐదు రోజుల పాటు కల్యాణోత్సవం, ఊంజల్ సేవను రద్దు చేసినట్లు టీటీడీ అధికారులు తెలిపారు. టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు, దాససాహిత్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఆధ్యాత్మిక, భక్తి సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, కోలాటాలు నిర్వహించనున్నారు.

ముగిసిన బాస్కెట్‌బాల్ పోటీలు

చిత్తూరు కలెక్టరేట్ : రెండు రోజులుగా జిల్లా కేంద్రంలోని మెసానికల్ మైదానంలో నిర్వహిస్తున్న అండర్– 23 రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీలు గురువారంతో ముగిశాయి. ఈ పోటీలకు రాష్ట్రంలోని పలు జిల్లాల బాలురు, బాలికలు పాల్గొన్నారు. బాలుర విభాగంలో అనంతపురం, చిత్తూరు జిల్లాల మధ్య పోటీలు హోరా హోరీగా సాగాయి. ఇందులో అనంతపురం విన్నర్స్‌గా, చిత్తూరు రన్నర్స్‌గా, మూడో స్థానంలో తూర్పుగోదావరి జట్లు గెలుపొందాయి. అదే విధంగా బాలికల విభాగంలో ఫైనల్స్ కృష్ణా, తూర్పుగోదావరి జట్లు తలబడ్డాయి. ఇందులో కృష్ణా విన్నర్స్‌గా, తూర్పుగోదావరి రన్నర్స్‌గా, మూడవ స్థానంలో పశ్చిమ గోదావరి జట్లు గెలుపొందాయి. గెలుపొందిన క్రీడాకారుల జట్లకు ఏపీ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చెంగల్రాయనాయుడు, తదితరులు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేసి అభినందించారు.


బాలుర విభాగంలో మొదటి స్థానంలో అనంతపురం జట్టు


బాలికల విభాగంలో మొదటి స్థానంలో కృష్ణా జట్టు